బతుకే పోయింది.. బతుకమ్మ ఎట్ల?

కాంగ్రెస్ సర్కార్ మా జీవితాలు ఆగం చేసింది

శిథిలాల మధ్యే బతుకీడుస్తున్న సున్నం చెరువు బాధితులు

'మా బతుకే ఆగమైంది.. ఇక బతుకమ్మ పండుగ ఎట్ల జరుపుకోవాలె.. తెల్లారుజామునే వచ్చిన్రు.. కూలగొట్టిన్రు.. పోయిన్రు. ఆ తర్వాత మా దిక్కైనా చూడలేదు. ఇప్పుడేమో పండుగొచ్చింది.. మా బతుకులను ఆగం జేసిన రేవంత్‌రెడ్డి బాగుపడుతడా.. మేం జరుపుకోని పండుగ వాళ్ల ఇంట్లో ఎట్ల జరుపుకుంటడు.. ఇది న్యాయమేనా..అంటూ సున్నం చెరువు బాధితురాలు తిరుపతమ్మ కన్నీరుమున్నీరైంది.

మా జాగలు తీసుకుర్రు.. మల్ల జాగలు చూపిస్తలేరు. ఎక్కడకు పోవాలె.. ఎట్ల బతకాలె. మాకు పండుగలుండవా.. పోయినసారి సర్కార్ బతుకమ్మ చీరెలు ఇచ్చిర్రు. మేం బాగా జరుపుకున్నం. కూలీకిపోతే నాలుగుపైసలొచ్చేవి.. ఇప్పుడా సంబురమే లేకుండా పోయింది. ఉన్న ఇల్లు కూలగొట్టిండు.. కట్టుబట్టలతో బయటకు వచ్చినం. ఇప్పుడేమో ఇల్లు చూపించడాయె. చీరెలు ముచ్చటే లేదు. ఇదేం ప్రభుత్వం ఇదెక్కడి పాలన.. అంటూ చంద్రుబాయ్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఇది ఈ ఇద్దరు మహిళల ఆవేదన మాత్రమే కాదు.. సున్నం చెరువు కూల్చివేతలలో ఇండ్లు కోల్పోయి తమ సర్వస్వం రోడ్డుపాలైన బాధితులందరి ఆవేదన. మహిళలంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే బతుకమ్మ పండుగ ఈ బడుగుజీవులకు దూరమైంది..

– సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ):

సున్నం చెరువులో కూల్చివేసిన నిర్మాణాల శిథిలాలు (ఫైల్)

ఆటపాటలతో ఆనందంగా పండుగ జరుపుకోవలసిన ఈ సమయంలో వారి బతుకే రోడ్డుపాలైంది. కాంగ్రెస్ సర్కార్ పుణ్యమాని వారి జీవితాల్లో ఈ యేడు పూలసంబురమే లేకుండా పోయింది.

శిథిలాల మధ్య బిక్కుబిక్కుమంటూ..!

మాదాపూర్ సున్నం చెరువులోని ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను గతనెల 8న హైడ్రా బుల్డోజర్లతో కూల్చివేసింది. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, కనీసం తమ ఇంట్లో సామగ్రి బయటకు తీసుకోకుండా వర్షం పడుతున్న సమయంలో అందరిని కట్టుబట్టలతో బయటకు పంపి కూల్చివేతలు చేపట్టింది. దీంతో తామెక్కడకు పోవాలో తెలియక అక్కడే కూల్చివేతల శిథిలాల మధ్యే బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని వీరి జీవితంలో పండుగసంబురాల మాటేమో కానీ ఎవరు కదిలించినా కన్నీటి వర్షమే కురుస్తుంది. సున్నం చెరువు బాధితులతో మాట్లాడటానికి వెళ్లిన నమస్తే తెలంగాణకు ఆ ప్రాంతమంతా శిథిలాలతో నిండి హృదయవిదారకంగా కనిపించింది. బతుకమ్మ పండుగ దగ్గరికి వస్తున్నదంటే సొంతూళ్లకు పోవడానికి డబ్బులు రెడీ చేసుకోవడం.. పండుగంతా ఖుషీగా జరుపుకోవడమనేది గత సంవత్సరం వరకు సాగింది. రేవంత్ సర్కార్ కారణంగా ఈ ఏడాది తమ జీవితంలో బతుకమ్మ పండుగే లేకుండా పోయిందని బాధపడుతున్నారు. పెద్దపెద్ద భవనాల జోలికిపోని హైడ్రా తమలాంటి నిరుపేద ఇళ్ల జోలికి వచ్చి మొత్తం ఇంటినే కూల్చేసింది. ఇల్లులేక.. పైసలు లేక.. పనులకు పోదామంటే పనులు దొరక్క అంతా ఆగమైపోయింది.. తమ బతుకే పోయింది.. బతుకమ్మ ఎట్ల జరుపుకోవాలని మహిళలంతా బోరుమన్నారు.

బతుకమ్మ సంబురమే లేదు..!

సున్నం చెరువుబాధితులు అక్కడి శిథిలాల మధ్యే బతుకుతున్నారు. గతనెల నుంచి ఇప్పటివరకు వారు కూలిపోయిన ఇళ్ల మధ్యే గుడిసెలు వేసుకుని కాలంవెళ్లదీస్తున్నారు. పండుగొచ్చింది.. సొంతూళ్లకు పోదామంటే చేతిలో చిల్లిగవ్వలేదు.. కట్టుకోవడానికి బట్టలు.. సామాను కూడా లేకుండా అక్కడా ఇక్కడా మిత్తిలకు తెచ్చి జీవనం సాగిస్తున్నారు. వీరంతా కూలీనాలి చేసుకుని బతికే బడుగుజీవులు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచి మాత్రమే కాకుండా మహబూబ్‌నగర్ జిల్లానుంచి ఇక్కడకు కొన్నేళ్ల క్రితం వలస వచ్చి బతుకుతున్నారు. రేవంత్‌సర్కార్ తమపై పగబట్టినట్లుగా ఇండ్లు కూల్చేయడంతో తమ జీవితంలో పండుగ లేకుండా పోయిందని వాపోతున్నారు. గత ఏడాది ఇదే సమయానికి బతుకమ్మ చీరెలు వచ్చాయని, కానీ ఈసారి ఉన్న ఇళ్లు కూడా పోయాయని ఆవేదన చెందుతున్నారు. ఎవరన్నా ఏమన్నా అంటే కేసులు పెడ్తున్నారని భయపడుతున్నారు. కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. ఉండటానికి ఉన్న ఇల్లు కూడా గుడిసె కావడంతో రాత్రైతే ఎలా తెల్లారుతుందా అంటూ భయంభయంగా బతుకుతున్నామని చెబుతున్నారు. రేవంత్ సర్కార్‌కు శాపనార్థాలు పెడుతూ వాళ్లు మాత్రం పండుగ చేసుకోవాలె కానీ మేం చేసుకోవద్దని అనుకున్నడు.. అట్లనే చేసిండని ఆగ్రహిస్తున్నారు. గత నెల కూల్చివేతల్లో పుస్తకాలు ఏరుకుంటూ కనిపించిన చిన్నారులు ఆరోజునుంచి ఈరోజు వరకు బడికి కూడా పోలేదట. పండుగ సెలవులు నెల ముందే వచ్చినయని, పరీక్షలు ఉన్నా.. పుస్తకాలు పోయినయని.. పిల్లలు బాధపడుతున్నారు.

ఇల్లు కూలగొట్టి రోడ్డుపాల్జేసిర్రు

పొద్దుపొద్దుగాల్నె వచ్చి ఇల్లు కూలగొట్టిండ్రు. మమ్మల్ని బయటకు పంపించి కట్టుకునే బట్టలు కూడా తీసుకోకుండా చేసిర్రు. ఇప్పుడేమో బతుకమ్మ పండుగొచ్చింది. ఇల్లే లేదాయె. పండుగ ఎక్కడ చేసుకోవాలె. గతేడాది బతుకమ్మ చీరెలు ఇచ్చిర్రు. ఈ ఏడాది ఉన్న ఇల్లుకూడా కూలగొట్టి మమ్మల్ని రోడ్డుపాల్జేసిర్రు. ఇదెక్కడి న్యాయం. నెలరోజుల నుంచి అవస్థలు పడుతున్నం. కూలగొట్టినోడికి కనికరమే లేదాయె.

– చంద్రుబాయ్, స్థానికమహిళ

రేవంత్ రెడ్డికి న్యాయమైతదా..

నిరుడు బతుకమ్మ పండుగ వస్తున్నదంటే ముందే అన్నీ సవరించుకునేది. పెత్రామస ముందే సగబెట్టుకుని సద్దుల వరకు ఊరికి పోయేది. ఇప్పుడేం లేదు. అంతా రోడ్డుపాలైంది. అసలు ఇల్లేలేకుండా పోయింది. ఎట్ల బతుకాల్నో తెలుస్త లేదు. పోయినసారి సర్కార్ బతుకమ్మ చీరెలిచ్చింది. పండుగ మస్త్ ఘనంగా చేసుకున్నం. ఈసారి సర్కారోళ్లు ఉన్న ఇల్లు కూలగొట్టి పండుగే లేకుండా చేసిర్రు. ఇది రేవంత్ రెడ్డికి న్యాయమైతదా.

–భూక్య నీల, స్థానికురాలు

గర్భిణితో ఉన్నా.. నెట్టేసిర్రు

మొన్న మా ఇల్లు కూలగొట్టినప్పుడు మొత్తం నా చిట్టీలన్నీ పోయినయ్. హాస్పిటల్‌కు పోతే డాక్టర్ పాత చిట్టీలు లేకపోతే నీ రికార్డ్ ఎట్ల చూడాలమ్మ అని తిట్టిండు. పండుగ చేసుకుందామంటే కూడా చిల్లిగవ్వ లేకుండా పోయింది. ఏం చేయాలే. ఈ కూలిపోయిన ఇంట్లో ఉంటున్న. కరెంట్ లేదు. బయటకు పోదామంటే కిరాయి ఎక్కువైతాంది. కూలిపనిచేసుకునేటోళ్లం. కడుపుతోని ఉన్నా అన్నా కనికరం లేకుండా గుంజిపడేసిర్ర.

– శివకుమారి, స్థానికురాలు

నాకు ఏడుపొస్తుంది..

మాది పెద్దకుటుంబం. ఉన్నపలంగా వచ్చి ఇల్లుకూలగొట్టిపోయిర్ర. ఎక్కడ ఉండాల్నో తెలవక.. వేరే దగ్గరకు పోలేక ఇక్కడనే గుడిసె ఏసుకుని బతుకుతున్నం. కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. అయినా భయపడుకుంటయినా ఇక్కడనే ఉంటున్నం. మా పిల్లగాళ్లు బతుకమ్మ పండుగొచ్చింది చేసుకుందామంటే నాకు ఏడుపొస్తున్నది. ఏం చేయాలె. ఒక్కరూపాయి లేదు. ఉన్న ఇల్లు కూలిపాయె. కూలగొట్టిర్రు. గిట్ల చేస్తే గవర్నమెంటోళ్లకు న్యాయమైతదా..

–తిరుపతమ్మ, స్థానికురాలు

పోయినసారి బతుకమ్మ చీరెలు ఇచ్చిర్రు

పొద్దుగాలె వచ్చి ఇల్లు కూలగొట్టి పోయిర్రు. మాకు చెప్పనికూడా చెప్పలే. ఇంట్లో ఉన్న వస్తువులు కూడా తీసుకోనియలే. బట్టలు కూడా మట్టికిందే ఉన్నయ్. తీసుకుందామంటే అన్ని చిరిగిపోయినయ్. పోయినసారి ఈసమయానికి బతుకమ్మ ఎంత బాగా జరుపుకున్నం. ఇప్పుడు మా గతేంది. ఉన్న ఇల్లు పోవడంతో. బతుకే లేకుండా పోయింది. బతుకమ్మ చీరెలు పోయిన సారి ఇచ్చిర్రు.

–నీల, స్థానికురాలు

పుస్తకాలు లేవు..బడికిపోతలేను

కూలగొట్టినప్పటినుంచి బడికి పోతలేను. అసలు పుస్తకాలే లేవాయె. చదువుకుందామంటే పుస్తకాలు లేవు. సెలవుల తర్వాత పరీక్షలు ఉన్నయ్. కానీ ఎట్ల రాయాల్నో తెలుస్తలేదు. ఈసారి నాకు ఇల్లు కూలగొట్టిర్రు కాబట్టి బడి బంద్ చేసిన సెలవులు ముందే వచ్చినయ్. ఇల్లు లేక గుడిసెలో పండుకుంటున్నం. రాత్రైతే చెల్లెకు, నాకు భయమైతుంది. దసరా పండుగ చేసుకుందామంటే ఎట్ల చేసుకోవాలె. బతుకమ్మ అంటేనే అమ్మ ఏడుస్తుంది.– పవన్, ఎనిమిదవతరగతి విద్యార్థి

మనస్తాపంతో భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

- కులపెద్దలు అవమానపరుస్తున్నారని ఆరోపణ

రామన్నపేట, అక్టోబర్ 1 : కులపెద్దలు తమను అవమానపరుస్తున్నారని మనస్తాపం చెందిన భార్యాభర్తలు ఆత్మహత్యకు యత్నించారు. ఈ సంఘటన మండలంలోని మునిపంపుల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిపంపుల గ్రామానికి చెందిన కల్లూరి రమేశ్, కల్లూరి నర్సింహులు అన్నదమ్ములు. వీరికి వ్యవసాయ భూమి భాగపంపిణీ విషయంలో ఆరు నెలలుగా పంచాయితీ నడుస్తుంది. గతంలో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకొని తీర్మానం చేసుకున్నారు. ఆ తీర్మానాన్ని రమేశ్‌కు నచ్చక అభ్యంతరం తెలిపాడు. ఈ క్రమంలో ఆగస్టు 26న గ్రామంలో జరిగిన బోనాలు, కాటమయ్య పండుగలో కుల పెద్దలకు, రమేశ్‌కు వివాదం జరిగింది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరుగడంతో ఒకరిపై మరొకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30న రాత్రి తాటి చెట్ల పంపకం విషయంలో కుల పెద్దలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కులానికి క్షమాపణ చెప్పాలని మరికొందరు పెద్ద మనుషులు అవమానకరంగా మాట్లాడటంతో రమేశ్ మనస్తాపం చెందాడు. వెంటనే భార్య వసంతను బైక్‌పై ఎక్కించుకొని అదే రాత్రి తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. తాము పురుగుల మందు తాగామని గ్రామానికి చెందిన కూనూరు రాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దాంతో గ్రామస్తులు వెళ్లి వారిని రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. అక్కడి డాక్టర్ పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని ఎస్ఐ మల్లయ్యకు సమాచారం అందించగా.. ఆయన హైదరాబాద్‌కు వెళ్లి దంపతుల మరణ వాగ్మూలం రికార్డు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుర్గాదేవి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి : ఎస్ఐ

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 1 : దుర్గాదేవి ఉత్సవాలను శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్ఐ కె.భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో దుర్గాదేవి ఉత్సవ నిర్వాహకులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా డీజే ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుర్గామాత మండపాల వద్ద నిర్వాహకులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని, ఫైబర్‌తో కూడిన మండపాలు నిర్వహిస్తే అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పే విధంగా డ్రమ్ముల్లో నీటిని, ఇసుకను అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొబేషనరీ ఎస్ఐ వంశీగౌడ్, ఏఎస్ఐలు శంకర్‌నాయక్, సైదిరెడ్డి, సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : తాసీల్దార్

మోటకొండూర్, అక్టోబర్ 1 : క్రీడలతో శారీరక, మానసికోల్లాసం లభిస్తుందని తాసీల్దార్ శాంతిలాల్ అన్నారు. 68వ ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి 14నుంచి 17ఏండ్లలోపు బాలబాలికలకు హ్యాండ్‌బాల్ పోటీలను మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాంరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తాసీల్దార్ మాట్లాడారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు, మండలానికి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెజ్జం బాలకృష్ణ, నాతి మల్లేశం, రాజగోపాల్, భాగ్యశ్రీ, ప్రభాకర్‌రెడ్డి, విశ్వరూపం, దశరథరెడ్డి, నాగయ్య, మధుసూదన్ పాల్గొన్నారు.

'కేటీఆర్‌ను అడ్డుకోవడం కాంగ్రెస్ దిగజారుడు తనమే'

సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్, యాకూబ్‌రెడ్డి

మోత్కూరు, అక్టోబర్ 1 : హైడ్రా బాధితులను ఓదార్చేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను పోలీసులతో అడ్డుకోవడం కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడం చేతగాక హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిపై ప్రజలు పునరాలోచనలో పడ్డారని, ప్రజల సమస్యలు పట్టని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను ప్రజలు నిలదీస్తున్నారని పేర్కొన్నారు. పోలీసు అధికారులు బాధ్యతలను విస్మరించి పని చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పెద్దలకు గులాం చేసినంత కాలం రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ నాయకుల అరాచక దాడులను ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు జంగ శ్రీను, మర్రి అనిల్‌కుమార్, గజ్జి మల్లేశ్, బయ్యని పిచ్చయ్య, రాంపాక నాగయ్య, పానుగుళ్ల విష్ణుమూర్తిగౌడ్, కంచర్ల క్రాంతిరెడ్డి పాల్గొన్నారు.

మూడు ఉద్యోగాలకు ఎంపిక

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 1 : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన బండి యమున మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇంద్రియాల గ్రామానికి చెందిన బండి మల్లేశ్, కవిత దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారి పెద్ద కూతురు యమున మొదటి ప్రయత్నంలోనే ఎస్‌జీటీలో జిలా తొమ్మిదవ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్‌లో ఐదవ ర్యాంకు, హాస్టల్ వెల్ఫేర్‌లో ఆరవ ర్యాంకు సాధించింది. ఎలాంటి కోచింగ్ లేకుండా మూడు ఉద్యోగాలు సాధించడంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. యమునను మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నోముల మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పెడ్డిరెడ్డి యాదగిరి బుధవారం సన్మానించారు.

మూడు టీచర్ పోస్టులు సాధించిన పారిజాత

గోరంట్ల పారిజాత

రామన్నపేట, అక్టోబర్ 1 : రామన్నపేటకు చెందిన గోరంట్ల పారిజాత 2024 డీఎస్సీలో మూడు టీచర్ పోస్టులకు మెరుగైన ర్యాంకులు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో జిల్లాస్థాయిలో 16వ ర్యాంకు, లాంగ్వేజ్ పండిట్‌లో 13వ, ఎస్‌జీటీ విభాగంలో 24వ ర్యాంకు సాధించారు. భర్త ప్రోత్సాహంతోనే తాను మెరుగైన ర్యాంకులు సాధించగలిగానని, డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా ఎంపిక కావడమే తన లక్ష్యమని ఆమె తెలిపారు. పారిజాతకు కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

సింగిల్ ఫేజ్ స్టాటర్ల వాడకంపై శిక్షణ

మంచినీటి సరఫరా సహాయకులకు సింగిల్, త్రీ ఫేజ్ స్టాటర్ల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న టెక్నీషియన్స్

వలిగొండ, అక్టోబర్ 1 : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మంచినీటి సహాయకులకు సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ స్టాటర్ల వినియోగంపై ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ కరుణాకర్, డీఈ ప్రశాంత్‌కుమార్, ఏఈ మహేశ్, ఎంపీఓ కేదారేశ్వర్, శిక్షకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 1 : గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి జరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు అన్నారు. మండలంలోని కూనూరు పరిసర వ్యవసాయ క్షేత్రాల్లో భూసారం, ఎరువుల వాడకం, పంటల మార్పిడి, పంటల దిగుబడి, మహిళా వ్యవసాయ కార్మికుల ఆరోగ్యం, పిల్లల ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై మంగళవారం పరిశోధనలు చేశారు. అనంతరం వ్యవసాయ రంగంలోని మహిళలకు ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, గర్భధారణ, పిల్లల పెంపకంపై అవగాహన కల్పించారు. విశ్వవిద్యాలయం విద్యార్థులు పి.సింధూజ, బి.ఇంద్రాణి, డి.మహేశ్వరి, వి.సాయినిఖిత, జి.గౌతమి పాల్గొన్నారు.

బహదూర్‌పేటలో గొర్రెల చోరీ

ఆలేరు టౌన్, అక్టోబర్ 1 : ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పేటలో సోమవారం రాత్రి 22 గొర్రెలు చోరీకి గురయ్యాయి. ఆలేరు పట్టణంలోని ఆరో వార్డు బహదూర్‌పేటలో కూళ్ల చంద్రశేఖర్‌కు చెందిన 20 గొర్రెలు, అదే వార్డుకు చెందిన కూళ్ల సాయిలుకి రెండు గొర్రెలు చోరీకి గురయ్యాయి. చంద్రశేఖర్, సాయిలు ఉదయం గొర్ల దొడ్డి వైపు వెళ్లి చూడగా గొర్రెలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రజనీకర్ తెలిపారు.

వైద్య సిబ్బందికి చీరెలు పంపిణీ

వలిగొండ, అక్టోబర్1: మండలంలోని వర్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జ్యోతి ఆమె తండ్రి జ్ఞాపకార్థం వర్కట్‌పల్లి, వేములకొండ, వలిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, నర్సులు, ఆశ కార్యకర్తలు, ఆయాలకు మంగళవారం చీరెలు అందజేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

శివపార్వతి

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 1 : పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం మీనవల్లు గ్రామానికి చెందిన శల్లా శివపార్వతి(20), పక్క గ్రామం అయిన శివపురం గ్రామానికి చెందిన చల్లా కృష్ణ ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకొని పోచంపల్లి పోలీసులను ఆశ్రయించారు. అప్పటి నుంచి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో జీవనం సాగిస్తున్నారు. అయితే.. ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శివపార్వతి మూడు నెలల గర్భవతి కావడంతో కృష్ణ మంగళవారం ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించి ఇంటికి తీసుకొచ్చాడు. అనంతరం పనికి వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చేసరికి శివపార్వతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించింది. కృష్ణ వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 1. విద్య, విజ్ఞాన బోధనతో పాటు, సంగీతం, సాహిత్యం, కళలు, క్రీడా రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు అక్టోబర్ 5 అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించనున్నట్లు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఈ.ఎస్.ఎస్ నారాయణ మాస్టారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 13న నగరంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమ అర్హతలతో అక్టోబర్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9652347207నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉద్యోగుల హామీల అమలులో ప్రభుత్వం విఫలం : టీపీయూఎస్

ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను వివరిస్తున్న సాయిరెడ్డి

చౌటుప్పల్, అక్టోబర్ 1 : ఉద్యోగులు, ఉపాధ్యాయుల హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీయూఎస్ మాజీ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి అన్నారు. మంగళవారం చౌటుప్పల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదును వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఒక డీఏ కూడా ఇవ్వకుండా తాత్సారం చేస్తుందన్నారు. దసరా పండుగకు మూడు డీఏలైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటును ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

మూసీ అభివృద్ధి పేరిట .. కాంగ్రెస్ లూటీ..

- ఇండ్లు కూల్చేందుకు వచ్చే అధికారులను చెప్పు, చీపురులతో అడ్డుకోవాలి
- పేదల గూడు చెరిపి మాల్, మల్టీప్లెక్సులు ఎందుకు?
- మూసీ బాధితులకు బీఆర్‌ఎస్ భరోసా

ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా..!

ఇందిరమ్మ రాజ్యం తెస్తానని ఓట్లే పించుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఇండ్లు కూల్చుతున్నడు. కాయ కష్టం చేసి రూపాయి రూపాయి పోగేసి 60 గజాల్లో ఇల్లు కట్టుకుని గత ముప్పై ఏండ్లుగా ఇక్కడనే ఉంటున్నాం. ఇప్పుడు ఉన్నట్టుండి ఇండ్లు కూలుస్తామని అంటున్నరు.. మేమెక్కడికి పోవాలె..ఎట్ల బతకాలే...ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా..!

– సుమతి, తులసీరాంనగర్, గోల్నాక

చావనైనా చస్తాం.. ఇక్కడి నుంచి కదలం

ఎన్నో ప్రభుత్వాలను చూశాం.. ఎందరో ముఖ్యమంత్రులను చూశాం.. కానీ ఇసొంటి ముఖ్యమంత్రిని మాత్రం ఇప్పటి వరకు చూడలె.. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి తొమ్మిది నెలలైనా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు.. ఇప్పుడొచ్చి మూసీని లండన్ చేస్తా నంటూ పేదోళ్ల జీవితాలతో ఆటలాడుకుంటున్నాడు..మా ఇండ్ల జోలికొస్తే చావనైనా చస్తాం కానీ..ఇక్కడి నుంచి కదలం.

– కమీర్, తులసీరాంనగర్, గోల్నాక,

రేవంత్‌కు మా ఉసురు తగులుతది

నెల రోజులుగా తిండి తిప్పలు లేకుండా నిద్రలేని రాత్రులు గడపుతున్నాం.. ముప్పై ఏండ్ల కింద ఇక్కడ 60 గజాల జాగా కొనుక్కొని ఇల్లు కట్టుకున్నాం.. నల్లా బిల్లు, కరెంటు బిల్లు, ఇంటి ట్యాక్సీ కూడా కడుతున్నాం..పట్టా కాగితాలు కూడా ఉన్నయి. ఇప్పుడు మా ఇల్లు కూల్చుతామనడం ప్రభుత్వానికి ఎంత వరకు న్యాయం.. సీఎం రేవంత్ రెడ్డికి మా ఉసురు తగులుతది.

– ఉమాదేవి,తులసీరాంనగర్, గోల్నాక

పేదలపై రేవంత్ రెడ్డి కక్ష కట్టిండు

మేము కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వెయ్యలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్ష కట్టిండు.. ఇప్పుడు మా ఇండ్లు కూల్చేస్తామని భయ పెడుతుండు.. నాకు ఇద్దరు చిన్న పిల్లలు..కూలీ నాలీ పనిచేస్తూ బతుకెళ్లదీస్తున్నం..పిల్లలు మన ఇల్లు కూల్చుతారా మమ్మీ.. ఎక్కడ ఉంటాం....మేమెక్కడ చదువు కోవాలె అంటూ తిండి తినకుండా బెంగ పెట్టుకొని జ్వరాల పాలైనరు..

– లక్ష్మి, తులసీరాంనగర్, గోల్నాక

ప్రాణమైనా తీసుకుంటం.. కదలం

మేం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇండ్లు కట్టుకోలే.. పైసా పైసా పోగేసిన సొమ్ముతో ఇంటి స్థలం కొనుకున్నాం. ఇండ్లకు నంబర్లు ఇచ్చిన్రు..డ్రైనేజీలు, రోడ్లు వేసిండ్రు..టాక్సీలు కడుతున్నం.. ఇప్పుడొచ్చి మీ ఇంటిని కూల్చుతాం..దూరంలో డబుల్ బెడ్రూం ఇస్తాం అంటే ఎలా పోతాం.. ప్రాణమైనా తీసుకుంటం కానీ ఇక్కడి నుంచి కదలం

–మల్లేశ్‌గౌడ్, తులసీరాంనగర్, గోల్నాక

గరీబోళ్ల జోలికొస్తే నాశనమైతరు

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్‌కు పోయే కాలం దగ్గరకొచ్చింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గరీబోళ్ల జోలికొస్తే సర్వనాశనం అయితరు..తాము కష్ట పడి కట్టుకున్న ఇంటికి బదులుగా అడువుల్లో డబుల్ బెడ్రూం ఇస్తామనడం సరైనా పద్ధతి కాదు.. మా ఇండ్లు కూలగొడతామంటే మాత్రం ఊరుకోం.. మళ్లీ కాంగ్రెసోళ్లు ఓట్లడగడానికి వస్తే సరైన సమాధానం చెబుతాం..

– శంకరమ్మ, తులసీరాంనగర్, గోల్నాక